సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం | 10 | నవంబర్ | 2024



రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ అనంతరం అభివాదం చేస్తున్న హిమతేజ

శతక్కొట్టాడు..

ఆదిలాబాద్ గల్లీలో బ్యాట్ పట్టి.. హైదరాబాద్ తరఫున సత్తా చాటుతూ.. టీమిండియా రేసులోకి దూసుకొస్తున్నాడు మనోడు. ఎస్జీఎఫ్ నుంచి హెచ్‌సీఏ దాకా అంచెలంచెలుగా ఎదిగి.. మ్యాచ్ ఏదయినా పరుగుల వరద సృష్టిస్తున్నాడు. జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తూ భారత జట్టుకు మన ఆశాకిరణంగా నిలుస్తున్నాడు. ప్రస్తుత రంజీ ట్రోఫీలో ఏడు ఇన్నింగ్స్‌ల్లో మూడు అర్ధసెంచరీలకు తాజాగా అజేయ సెంచరీ తోడవడం హిమ తేజ బ్యాటింగ్ విన్యాసాలకు నిదర్శనం.

- వివరాలు 10లో ▸

న్యూస్‌రీల్

రేపటి ప్రజావాణి రద్దు

కైలాస్‌నగర్: జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు. అలాగే సర్వే కోసం ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి సమగ్ర సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

'ఎక్స్‌లెంట్ డెసిషన్ ఎమ్మెల్యే గారు..'

- అనిల్ జాదవ్‌ను ఉద్దేశించి 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్



ట్వీట్ చేసిన కేటీఆర్

బోథ్: 'ఎక్స్‌లెంట్ డెసిషన్ ఎమ్మెల్యే గారు..' అంటూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఉద్దేశించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్యాయం జరుగుతోందని, తేమ శాతం పేరిట ధర తగ్గిస్తున్నారని బోథ్ మండలంలోని సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే నిరాకరించారు. రైతులకు న్యాయం జరగని కేంద్రాల ప్రారంభోత్సవంలో పాల్గొనని సీసీఐ అధికారులకు చెప్పారు. దీంతో కేటీఆర్ ఎక్స్‌లో స్పందించి ఎమ్మెల్యేను అభినందించారు.

నాణ్యమైన వైద్యమందించాలి



ఎంఆర్ఐ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌కు వచ్చే నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన రిమ్స్‌ను తనిఖీ చేశారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులతో కలిసి ఆసుపత్రిలోని జనరల్, చిల్డ్రన్ వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఆర్ఐ యంత్రాన్ని పరిశీలించారు. రోగుల సౌకర్యార్థం త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేలా చూడాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, రిమ్స్ వైద్యులు ఉన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



వాలీబాల్ క్రీడాకారులతో అధికారులు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్-14 బాలబాలికల జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ రాజేశ్, హరిచరణ్, రాము, రవీందర్, ప్రతాప్ సింగ్, సర్దార్‌సింగ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణను బాధ్యతగా భావించాలి

ఆదిలాబాద్‌టౌన్: వయోవృద్ధుల సంరక్షణను భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా సంక్షేమాధికారి సబిత అన్నారు. అక్టోబర్ 1న నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవానికి హాజరుకాని వృద్ధులను శనివారం వారి ఇళ్లవద్దకే వెళ్లి సన్మానించారు. పట్టణంలోని రాణిసతీజీ కాలనీకి చెందిన 90 ఏళ్లపైబడిన నాలం గంగుబాయి అనే వృద్ధురాలిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధుల శేషజీవితం ఆనందంగా సాగేలా చూడాల్సిన బాధ్యత వారి పిల్లలు, వారసులపై ఉందన్నారు. ఇందులో ఎఫ్ఆర్‌వో పోశెట్టి, వయో వృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, సభ్యులు వామన్‌రావు, కిశోర్, మోహన్, ప్రకాశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తోషంలో సర్వే సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా



సర్వే పకడ్బందీగా చేపట్టాలి

గుడిహత్నూర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని తోషంలో నిర్వహిస్తున్న సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు అవసరమైన పక్షంలో అదనపు సిబ్బంది ఏర్పాటు చేయాలని నోడల్ అధికారులకు సూచించారు. ఇంటింటికీ అతికించిన స్టిక్కర్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అబ్దుల్ హై, తదితర అధికారులున్నారు.

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామంలో చేపట్టిన సర్వేను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఆయన వెంట డీఎల్‌పీవో ఫణిందర్, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్ తదితరులున్నారు.

తొలిరోజు.. స్లో!

- ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే
- సమాచార సేకరణలో ఎన్యుమరేటర్లు
- వివరాల నమోదులో తీవ్ర జాప్యం
- సర్వే తీరును పరిశీలించిన కలెక్టర్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో శనివారం ప్రారంభమైంది. తొలిరోజు నెమ్మదిగా సాగింది. అవసరమైన ఫారాలు, మార్గదర్శకాల బుక్‌లెట్లను తీసుకున్న సిబ్బంది తమకు కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌కు వెళ్లి సర్వేచేట్టారు. హౌస్ లిస్టింగ్ స్టిక్కరింగ్ ప్రకారం ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబాల సమాచారం సేకరించారు. తొలిరోజు కావడం, ప్రతీ ప్రశ్నకు సంబంధించిన కోడ్‌లను బుక్‌లెట్‌లో చూస్తూ రాయాల్సి రావడంతో వివరాల న మోదు ఆలస్యమైంది. ఒక్కో కుటుంబానికి సగటున 35 నుంచి 50 నిమిషాల వరకు పట్టింది. సిరికొండ మండలం సుంకిడిలో, గుడిహత్నూర్ మండలం తోషంలో సర్వే తీరును కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. అలాగే భీంపూర్ మండలం పిప్పల్‌కోటి, ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పది ఫారాలు మాత్రమే..

సర్వే నిర్వహణకు అవసరమైన బుక్‌లెట్‌లు శుక్రవారం అర్ధరాత్రి దాటాక జిల్లాకు చేరడంతో వాటిని జెడ్పీ కార్యాలయంలో భద్రపరిచారు. శనివారం ఉదయం 7గంటల నుంచే గ్రామీణ ప్రాంతాల్లోని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మండలాల వారీగా అందించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు పది ప్రశ్నావళి ఫారాలు మాత్రమే అందజేశారు. వాటిని స్వీకరించిన వారు కేటాయించిన బ్లాక్‌లకు చేరుకున్నారు. హౌస్ లిస్టింగ్ స్టిక్కరింగ్‌లో భాగంగా గుర్తించిన ఇళ్ల ప్రకారం సర్వే చేపట్టారు.

వివరాల నమోదులో జాప్యం

సర్వేలో భాగంగా ఒక్కో కుటుంబానికి 56 ప్రశ్నలతో కూడిన 75 అంశాల సమాచారం సేకరిస్తున్నారు. అయితే తొలిరోజు కావడం, ప్రతీఅంశానికి సంబంధించిన కోడ్‌లను బుక్‌లెట్‌లో చూసి నమోదు చేయాల్సి రావడంతో తీవ్రజాప్యం అయింది. భార్యభర్తలకు సంబంధించిన వివరాల నమోదుకే 35 నుంచి 40 నిమిషాల సమయం పట్టింది. నలుగురు సభ్యులున్న కుటుంబ వివరాల నమోదుకు 50 నిమిషాల సమయం పట్టడం సర్వే నిర్వహణ తీరుకు అద్దం పడుతుంది. చాలా మంది త మకు సంబంధించిన ఆధార్, రేషన్‌కార్డు, ధరణి పట్టా వంటి వివరాలు అందుబాటులో ఉంచకపోవడంతోనే ఆలస్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రధానంగా సాగు భూములకు సంబంధించిన ప్రశ్నకు అనుబంధంగా తొమ్మిది గడులు నింపాల్సి ఉండగా, నివాస గృహానికి సంబంధించి పది గడులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ రెండు అంశాలకే ఎక్కువ సమయం పడుతుంది. చాలా మంది ప్రజలకు ఇంటి విస్తీర్ణం వివరాలు తెలియకపోవడం సమస్యగా మారుతోంది. కొంతమంది తమ వార్షికాదాయం, వృత్తి వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. నిర్దేశిత వివరాలన్నీ ప్రజ లు అందుబాటులో ఉంచుకున్నట్లైతే సర్వే త్వరితగతిన పూర్తయ్యే అవకాశముందని ఎన్యుమరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

మున్సిపాలిటీలో ఆలస్యం..

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఎన్యుమరేటర్లు మధ్యాహ్నం 3గంటల తర్వాతే ఆయా బ్లాక్‌లకు బయలుదేరి వెళ్లారు. సర్వే నిర్వహణపై కలెక్టర్ రాజర్షి షా సంబంధిత ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, మున్సిపల్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మధ్యాహ్నం 2.30గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వారికి ప్రశ్నావళి ఫారాలు, బుక్‌లెట్‌లను అందజేశారు. తొలిరోజు కావడం, సమయం మించిపోవడంతో ఒక్కొక్కరికి రెండు ఫారాలుమాత్రమే అందించారు. వాటిని తీసుకున్న సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్లకు అందించడంలోనూ ఆలస్యమే అయింది. 3గంటల సమయంలో ఒక్కొక్కరుగా ఈబీలకు వెళ్లి కుటుంబాల వివరాల నమోదులో నిమగ్నమయ్యారు. సరస్వతీనగర్‌లో సర్వేను మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు ప్రారంభించి పరిశీలించారు.



సర్వే సిబ్బందికి ఫారాలు, బుక్‌లెట్ అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

గోప్యంగా సర్వే సమాచారం

కైలాస్‌నగర్: సమగ్ర సర్వేలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన అనంతరం జిల్లాలోని సర్వే టీంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 56 అంశాలపై ప్రజల నుంచి కచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు.ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వేకు ముందురోజు గ్రామాలు, పట్టణంలో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఎంపీడీవో, తహసీల్దార్ల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే పూర్తయిన అనంతరం పూరించిన ఫారాలను భద్రపరచాలని ఆదేశించారు. గ్రామాల్లోని ఉదయం 7గంటలకు సర్వే ప్రారంభించాలన్నారు. రిపోర్టు నుమధ్యాహ్నం ఒంటిగంటకు, సాయంత్రం ఐదు గంటలకు సమర్పించాలన్నారు. ఈ వివరాల నమోదుకు గాను 395 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి,ఆర్డీవో వినోద్‌కుమార్, డీపీవో శ్రీలత, డీఈవో ప్రణీత, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు పాల్గొన్నారు.

తొలిరోజు 4,168 ఇళ్ల సర్వే

జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 4,168 ఇళ్లను ఎన్యుమరేటర్లు సర్వే చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 402ఇళ్లను, గ్రామీణ ప్రాంతాల్లో 3,766 ఇళ్లను సర్వే చేసినట్లు అధికారులు వెల్లడించారు.

క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహం

ఆదిలాబాద్: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తామని డీడీటీడబ్ల్యూ వసంత్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాయ్స్) కు చెందిన మడావి ప్రసాద్, కురిసేంగే ధనుకుమార్ ఎస్జీఎఫ్ అండర్-17 జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు వారిని పాఠశాలలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనుల్లో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తామని వెల్లడించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ మంచి ఫలితాలు సాధిస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి మాట్లాడుతూ, హర్యానాలోని రోహతక్‌లో త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇందులో హెచ్‌ఎం నారాయణరావు, రమేశ్, సురేందర్, ప్రభాకర్, అనిల్ పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న వసంత్‌రావు, తదితరులు

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు ప్రారంభం



ప్రత్యేక సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలగిరికి శనివారం ప్రత్యేక బస్సు సర్వీసును రీజనల్ మేనేజర్ సోలోమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులో డిప్యూటీ ఆర్‌ఎంలు ప్రణీత్, ప్రవీణ్, డిపో మేనేజర్ కల్పన, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చని 'అమృత్'

- గడువు ముగిసినా పూర్తికాని పనులు
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- శాఖల మధ్య సమన్వయలోపం
- పట్టణవాసులకు తప్పని నీటి తిప్పలు



వాటర్‌గ్రిడ్ నుంచి సరిపడా నీరురాకపోవడంతో అలంకారప్రాయంగా మారిన ఫిల్టర్‌బెడ్

కైలాస్‌నగర్: మున్సిపాలిటీల్లోని ప్రజల తాగునీటి కష్టాలు దూరం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు తాగు నీరు అందించేందుకు అమృత్-1 కింద నిధులు విడుదల చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గడువు ముగిసినా కమిషనింగ్ (పైపులైన్ల ద్వారా నీటి ప్రెషర్, లీకేజీలు పరిశీలించి సరఫరా అయ్యేలా చూడటం) ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో పలు కాలనీలకు నీటి సరఫరా అందడం లేదు. దీంతో వర్షాకాలంలోనూ ఆయా కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీరందించాల్సిన దుస్థితి.

రూ.90 కోట్లు విడుదల..

అమృత్ పథకంలో భాగంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీకి 2017లో రూ.90 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇందులో 50 శాతం కేంద్రం వాటా కాగా, 30శాతం రాష్ట్ర వాటా, మరో 20 శాతం మున్సిపాలిటీ ఖర్చు చేయాల్సి ఉంటుంది. పట్టణంలోని ఆయా కాలనీలను 11జోన్లుగా విభజించి వాటి పరిధిలో వాటర్ ట్యాంకులు, కొత్తగా పైపులైన్ల పనులు చేపట్టారు. వీటి టెండర్ దక్కించుకున్న ఎల్‌ఎన్‌టీ సంస్థ పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో పనులు చేపట్టేలా 6, మే, 2017లో అగ్రిమెంట్ చేసుకుంది. మార్కెట్‌యార్డు, స్వశక్తి భవన్, ఖానాపూర్, డైట్ కళాశాల మైదానంలో నాలుగు ట్యాంకుల నిర్మాణాలతో పాటు ఫిల్టర్‌బెడ్‌లో ఎల్వేటెడ్ రిజర్వాయర్ నిర్మించేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ ట్యాంకులతో పాటు పలు కాలనీల పరిధిలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా కొత్తలైన్లు వేయాల్సి ఉంది. అగ్రిమెంట్ ప్రకారం సదరు కాంట్రాక్టర్ ఈ పనులను 28, అక్టోబర్, 2021లోగా పూర్తి చేయాల్సి ఉంది.

కొనసా.. గుతున్న పనులు!

అగ్రిమెంట్ గడువు ముగిసి మూడేళ్లవుతున్నప్పటికీ అమృత్-1 పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నాలుగు ట్యాంకులు, ఓ రిజర్వాయర్ నిర్మాణాలు పూర్తయ్యాయి. హౌసింగ్‌బోర్డు కాలనీలో మాత్రమే పనులు పూర్తి కాగా నీటి సరఫరా జరుగుతోంది. మిగతా కాలనీల్లో తాత్కాలికంగా పనులు పూర్తి కాగా ఆయా కాలనీల్లో ఇప్పటికీ కమిషనింగ్ చేపట్టలేదు. చిల్కూరి లక్ష్మీనగర్, మహాలక్ష్మివాడ, తిర్పెల్లి-1, 2, వినాయక్‌చౌక్, శాంతినగర్, ఖానాపూర్, భాగ్యనగర్, భగత్‌సింగ్ నగర్, కేఆర్‌కే కాలనీల్లో కొత్తగా పైపులైన్లు వేసినప్పటికీ కమిషనింగ్ మాత్రం ఇంకా చేపట్టడం లేదు. దీంతో ఇప్పటికీ పాత పైపులైన్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. తరచూ లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతుండడంతో ప్రజలకు తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. ట్యాంకులు, పైపులైన్లకు కనెక్షన్లు ఇచ్చి నీటిని సరఫరా చేసేలా చూడాల్సిన అధికారులు తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం.. కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో పనులు పూర్తికాక ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇలా మొదటి విడత పనులే అసంపూర్తిగా ఉండి ప్రజలకు ప్రయోజనం చేకూర్చకపోగా అధికారులు అమృత్ రెండో విడత పనులను ప్రారంభించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శాఖల మధ్య సమన్వయలోపం

కాంట్రాక్టర్ ద్వారా కమిషనింగ్ ప్రక్రియ చేయించాల్సిన పబ్లిక్ హెల్త్, వాటర్‌గ్రిడ్ ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. పైపులైన్ల కమిషనింగ్‌కు అవసరమైన తాగునీటిని సరఫరా చేయడం లేదని పబ్లిక్ హెల్త్ అధికారులు చెబుతుండగా, కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని వాటర్‌గ్రిడ్ అధికారులు తప్పించుకుంటున్నారు. కొత్తగా వేసిన పైపులైన్లకు, ట్యాంకులకు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ఆయా కాలనీలకు వాటిద్వారా నీటి సరఫరా జరగడం లేదు. ఫలితంగా పలు కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాల్సి వస్తోంది. దీంతో బల్దియాపై అదనపు భారం పడుతోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేయించి నీటి సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'వాటర్‌గ్రిడ్' నిర్లక్ష్యంతోనే..

అమృత్ పథకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు రూ.22 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో కమిషనింగ్ చేసేందుకు సదరు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. ఇతర కాంట్రాక్టర్లతో పనులు చేయిద్దామనుకున్నా వారికి బిల్లులు రావడం లేదు. ఎలాగైనా కమిషనింగ్ చేసేందుకు ప్రయత్నిస్తే వాటర్‌గ్రిడ్ అధికారులు సరిపడా నీటిని వదలడం లేదు. పైపులైన్లలోని మట్టి తొలగిపోయి, లీకేజీలను గుర్తించాలంటే పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ వాటర్‌గ్రిడ్ అధికారులు సగం నీటిని కూడా ఇవ్వడం లేదు. దీంతోనే ప్రక్రియలో జాప్యం అవుతోంది.

– గంగాధర్, పబ్లిక్ హెల్త్ ఈఈ, ఆదిలాబాద్

ఓటరు నమోదుకు 695 దరఖాస్తులు

- నేడూ కొనసాగనున్న ప్రత్యేక శిబిరాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌వో

కైలాస్‌నగర్: ఓటర్ల జాబితా సవరణ-2024లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం మరో అవకాశం కల్పించింది. ఇందుకోసం శని, ఆదివారం రెండు రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు శ్రీకారం చుట్టింది. తొలిరోజు జిల్లాలోని 592 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటర్లుగా నమోదు కోసం ఫారం-6 ద్వారా 695 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఫారం-7కు సంబంధించి 58, ఫారం-8కు సంబంధించి 164 దరఖాస్తులు అందాయి. ఆదివారం కూడా ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోండి

తాంసి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. ప్రత్యేక ఓట రు నమోదులో భాగంగా పిప్పల్‌కోటిలో చేపట్టిన కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. బీఎల్‌వోలను ఓటరు నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. వారి వెంట మండల ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ నలందప్రియ, బీఎల్‌వోలు వెంకటమ్మ, సుజాత ఉన్నారు.



వివరాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

క్లుప్తంగా

అదృశ్యం


పోశయ్య

దహెగాం: మండలంలోని మొట్లగూడ గ్రామానికి చెందిన వృద్ధుడు ఎనగందుల పోశయ్య అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల 10న పోశయ్య ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లల్లో, చుట్టూ పక్క గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. కుమారుడు రమేశ్ ఫిర్యాదుతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలో రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి వచ్చారని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామానికి చెందిన దేవుల్ల శంకరమ్మ ఇల్లు శుక్రవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. కుటుంబ సభ్యులు రాత్రి భోజనం చేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో నిద్రిస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోయింది. ఇంట్లోని వస్తువులు, తిండిగింజలు, బట్టలు కాలి బూడిదయ్యాయి. రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు శంకరమ్మ కోరుతోంది. దగ్ధమైన ఇంటిని శనివారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సందర్శించి బాధితురాలిని పరామర్శించారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తిరుమల గౌడ్, మొట్ట కిరణ్‌కుమార్, వెంకటేష్, అబ్దుల్లా, ప్రకాష్, అభిరామ్‌రెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు. బాధితురాలిని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పరామర్శించారు. ఇందిరమ్మ ఇల్లు, నష్టపరిహారం మంజూరయ్యేలా చూస్తానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రఫీ, వెంకన్నయాదవ్, దేశ్‌ముఖ్, రాకేష్ పాల్గొన్నారు.

రెండోరోజు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు


పోటీల్లో తలపడుతున్న బాలికల జట్లు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు రెండోరోజు కొనసాగాయి. బాల,బాలికల విభాగంలో ప్రీక్వార్టర్స్ పోటీలు శనివారం రసవత్తరంగా సాగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 48 జట్లు దాదాపు 850 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. నెట్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రం ఆదిత్య రెడ్డి, సెక్రటరీ భాజాఖాన్, కోశాధికారి సోహెల్ రెహమాన్, జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నపూర్ణ, జమున, వన్నెల భూమన్న తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. ఆదివారంతో ఈ పోటీలు ముగియనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన ఏసీపీ రవికుమార్
- ఉమ్మడి 9 జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులు హాజరు


ఫైనల్‌కు చేరిన ఆదిలాబాద్ జిల్లా జట్టు


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలికలు

బెల్లంపల్లి: పట్టణంలోని సింగరేణి తిలక్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలను ఏర్పాటు చేశారు. ఆదివారం వరకు పోటీలు కొనసాగుతాయి. ఉమ్మడి 9 జిల్లాల నుంచి బాలికలు, బాలుర జట్లు హాజరు కాగా, 360 మంది క్రీడాకారులు, 40మంది టీమ్ మేనేజర్ కోచ్‌లు పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీవో పి.హరికృష్ణ, ఏసీపీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాపోటీలు విద్యార్థుల్లో క్రమశిక్షణను, పోటీతత్వాన్ని నింపుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–19 విభాగం సెక్రెటరీ బి.బాబురావు మాట్లాడుతూ క్రీడాకారుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తొలిరోజు ఆదిలాబాద్–రంగారెడ్డి జిల్లాల బాలుర, హైదరాబాద్–నిజామాబాద్ జిల్లాల బాలికల జట్లు తలపడ్డాయి.

ఫైనల్‌కు ఆదిలాబాద్ జిల్లాజట్టు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ఆరంగ్రేటం చేసింది. అత్యుత్తమంగా ఆడి ఫైనల్‌కు చేరింది. నిజామాబాద్ జిల్లా బాలుర జట్టుపై 7–0 స్కోర్‌తో మొదటి సెమీఫైనల్ పోటీలో విజయం సాధించింది. మెదక్–మహబూబ్‌నగర్ జిల్లాల బాలుర జట్లు సెమీ ఫైనల్ చేరాయి. ఆయా జట్ల మధ్య ఆదివారం సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుపై ఆదిలాబాద్ బాలుర జట్టు తుది పోరులో తలపడనుంది. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రామ్మోహన్, రవి, యాకూబ్, రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, స్వామి, సంతోష్, శ్రీనివాసరెడ్డి, చాంద్‌పాషా, చిన్నక్క, యాదగిరి, పరిశీలకులు గంగమోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటుతాం



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. సుదూర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొని ఉత్సాహంగా ఆడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా జట్టు గెలుపు సాధించడానికి స్థానిక పరిస్థితులు అనుకూలిస్తాయని భావిస్తున్నాం. ప్రతిభ ఉన్న క్రీడాకారులు జట్టులో ఉండటం కొండంత బలాన్నిస్తోంది. – రాజోపేటీ విక్కీ, ఆదిలాబాద్

సంతోషంగా ఉంది



హైదరాబాద్ చుట్టుపక్క ప్రాంతాల్లో మాత్రమే ఆడాం. ఈసారి కోల్‌బెల్ట్ ప్రాంతమైన బెల్లంపల్లికి రావడం కొత్త అనుభూతిని ఇస్తుంది. మా జట్టంతా ఉత్సాహంగా ఉంది. ఆటల్లో విజయం సాధించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం. స్థానిక క్రీడాకారులు, ప్రజలు తమను ప్రోత్సహించడం మరువలేం. – బి.వేణు, హైదరాబాద్

కొత్త పరిచయాలు



ఇతర జిల్లాల క్రీడాకారులతో తమకు స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడ్డాయి. కొత్తపరిచయాలతో క్రీడల్లో మెరుగ్గా రాణించాలని అనుకుంటున్నాం. జట్టు సమష్టి కృషితో ఆడి విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ పట్టుదలతో ఉన్నాం. – కె.అజయ్, ఆదిలాబాద్

పట్టుదలతో ఆడుతున్నాం



సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు గెలుపు కోసం పట్టుదలతో ఆడుతున్నాం. ఆటలో నైపుణ్యత కనబరిస్తే విజయం వరిస్తుంది. జాతీయ స్థాయిలో తాను ఇప్పటి వరకు నాలుగుసార్లు ఆడాను. అదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం. – టి.నేహశ్రీ, నిజామాబాద్

ఏ జట్టును తేలికగా తీసుకోం



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ప్రతి జట్టులో ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారు. ఏ జట్టును మేము తేలికగా తీసుకోబోం. అన్ని జట్లను సమానంగానే చూస్తాం. తుది వరకు పోరాడి విజయం సాధించడానికి కృషి చేస్తాం. – సీహెచ్.మానస, మెదక్

స్ఫూర్తిదాయకమైన ఆట ప్రదర్శిస్తాం



క్రీడల్లో గెలుపోటములు సహజం. జిల్లా జట్టు స్ఫూర్తిదాయకమైన ఆటను ప్రదర్శించడానికి ప్రాధాన్యత ఇస్తాం. నేను ఇప్పటి వరకు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. అనుభవంతో ప్రత్యర్థి జట్ల బల, బలాలను బేరీజు వేసుకుని ఆడుతాం. – ఎం.వర్షిత, మహబూబ్‌నగర్

వలస కార్మికుల చట్టాల సదస్సుకు జిల్లావాసి

నిర్మల్‌ఖిల్లా: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెల 8 నుంచి 10 వరకు కొనసాగనున్న అంతర్జాతీయ వలస కార్మికుల చట్టాలు–రక్షణ సదస్సులో జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల పాల్గొంటున్నారు. అంతర్జాతీయ వలస కార్మిక చట్టాల ద్వారా కార్మికుల రక్షణపై అవగాహన బి.ఎం.డబ్ల్యూ అండ్ సాస్క్..నేపాల్, భారత్ దేశాల్లో నిర్వహిస్తున్న ప్రాజెక్టు కార్యక్రమాలు తదితర అంశాలు ఈ సదస్సులో చర్చిస్తున్నట్లు స్వదేశ్ పేర్కొన్నారు. ఇమిగ్రేషన్ చట్టం–1983కు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరణలు అవసరమని, గల్ఫ్ దేశాల్లో కార్మికులు మృతిచెందుతున్న నేపథ్యంలో ప్రవాసీ భారతీయ బీమా యోజన వర్తింపజేయాలని యూనియన్ తరపున నివేదించినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆయనతోపాటు నిజామాబాద్ జిల్లా సమన్వయకర్త దీకొండ కిరణ్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీడబ్ల్యూఐ దక్షిణాసియా పాలసీ అధికారి రాజేష్‌శర్మ, ప్రోగ్రాం అధికారి ప్రేరణ ప్రసాద్ గుప్తా, నేపాల్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ నుంచి జయవిద్యా, సామ్రాట్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

కెరమెరి: పత్తి చేనులోంచి 45 పైపులను ఎత్తుకెళ్లిన ఘటనలో ఇద్దరిని రిమాండ్ తరలించినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని గోయగాం గ్రామానికి చెందిన నాగోసే సత్తయ్య, మొహర్లే జానకీరావులకు చెందిన పత్తి చేల నుంచి గత నెల 12న గోయగాంకు చెందిన గావ్రత్రె గణపతి, వాంకిడి మండలం లంజన్వీరకు చెందిన వాడై సుందరంల 45 నీటిపైపులను ఎత్తుకెళ్లారు. కెరమెరి పోలీసులు పట్టుకుని పైపులను స్వాధీనం చేసుకుని సిర్పూర్ కోర్టులో హాజరుచర్చగా శనివారం మెజిస్ట్రేట్ 14 రోజులు జ్యూడీషియల్ రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

గొడ్డలితో నరికి ఒకరి హత్య

- ముత్తరావుపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు


మల్లయ్య మృతదేహం

చెన్నూర్‌రూరల్: గొడ్డలితో నరికి ఒకరిని హత్య చేసిన ఘటన మండలంలోని ముత్తరావుపల్లిలో చోటుచేసుకుంది. చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి మల్లయ్య(50), భార్య మల్లక్క, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడు పైడిపల్లి రాజశేఖర్ అదే గ్రామానికి చెందిన జాడి భూమయ్య భార్య సౌందర్యను ఇష్టపడి ఏడు నెలల క్రితం వెళ్లిపోయి సహజీవనం చేస్తున్నారు. భార్య కనిపించడం లేదని భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు రాజశేఖర్, సౌందర్యను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికి సౌందర్య భర్తతో ఉండనని ప్రియుడు రాజశేఖర్‌తోనే ఉంటానని చెప్పి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రాజశేఖర్ కుటుంబంపై భూమయ్య పగ పెంచుకున్నాడు. రాజశేఖర్ తండ్రి మల్లయ్య శనివారం బహిర్భూమికని గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లగా అక్కడే వేచి ఉన్న భూమయ్య గొడ్డలితో నరికి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పెద్ద కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ


రేవోజీపేటలో విచారణ చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేటకు చెందిన వివాహిత లత వరకట్న వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి శనివారం విచారణ చేపట్టారు. మృతురాలి తల్లి పోగుల మల్లీశ్వరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీఐ సైదరావు, ఎస్సై శంకర్ తదితరులు ఉన్నారు.

పథకం ప్రకారం హత్య చేశారని..

మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మృతురాలు తల్లితోపాటు పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి మాట్లాడారు. అదనపు కట్నం కోసం లతను భర్త నాగరాజు, అత్తమామలు సత్తవ్వ, వెంకటి వేధించారన్నారు. పథకం ప్రకారమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు రాజగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు అభినవ్, గంగారెడ్డి, సుదర్శన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

భైంసారూరల్: మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నైలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ద్యారంగుల హన్మంతు(38) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆదిలాబాద్‌లో పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వికలాంగుల కాలనీకి చెందిన సయ్యద్ కలీం (38) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ సయ్యద్ ఇసాక్ అలీ కథనం ప్రకారం..శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎరోడ్రమ్ మైదానంలో పురుగుల మందు తాగి కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. కుటుంబీకులు అక్కడికి చేరుకుని అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గత రెండేళ్లుగా మద్యానికి బానిసైన కలీం జీవితంపై విరక్తితో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లుగా వివరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్–17 జిల్లాస్థాయి బాలికల హాకీ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు ఈ పోటీలను ప్రారంభించారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినవారు నిజామాబాద్ జిల్లాలో ఈనెల 11 నుంచి 13వ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రవీందర్, హరిచరణ్, శ్రీనివాస్, త్రివేణి, అశోక్, మహమ్మద్ తదితరులు ఉన్నారు.

సెమీస్‌లో ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు

ఆదిలాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో విజేతగా నిలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లిందని కోచ్ అరవింద్, మేనేజర్ స్ఫూర్తి, వివేక్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన బాలికల జట్టుకు ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, పీడీ హరిచరణ్‌లు అభినందనలు తెలిపారు.

కవ్వాల్.. ప్లాస్టిక్ ఫ్రీజోన్

- అటవీశాఖ ప్రత్యేక దృష్టి
- 'టైగర్ రిజర్వు'లో ప్లాస్టిక్ నిషేధం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ప్లాస్టిక్ వస్తువులతో అటవీ సిబ్బంది

జన్నారం: కవ్వాల్ టైగర్ రిజర్వు (కేటీఆర్)ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. కవ్వాల్ టైగర్‌జోన్ ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ఏర్పాటు చేశారు. గత జూలై 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చింది. ఈక్రమంలో అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వాడకం కొంత తగ్గింది. నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమంలో భాగంగా ఆడపదడపా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను సిబ్బంది తొలగిస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మధ్యలో జన్నారం మండలం ఉంది. ప్రయాణికులు అటవీప్రాంతం గుండా వివిధ గ్రామాలకు వెళ్తుంటారు. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందినవారు వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో ప్లాస్టిక్ సంచుల ద్వారా ఆహారం, తినుబండరాలు తీసుకెళ్తూ పాడేస్తున్నారు. వీటితో వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉంది. కాగితపు, జనపనార సంచులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని అధికారులు వ్యాపారులకు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని వారికి నోటీసులు జారీ చేశారు. ప్రజలు, పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే అవగాహన కల్పించారు.

పంచాయతీకి అప్పగింత

జన్నారం అటవీ డివిజన్‌లో నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపడుతున్నారు. రేంజ్ అధికారి నుంచి మొదలు, బేస్‌క్యాంపు సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారు. ప్లాస్టిక్‌వస్తువులను సేకరించి బస్తాల్లో నింపి గ్రామ పంచాయతీకి అప్పగిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు వందల సంఖ్యలో బస్తాలను పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు పంపినట్లు పేర్కొంటున్నారు.

నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత



జన్నారం అటవీ డివిజన్‌లో ప్లాస్టిక్ వస్తువులు పడేయొద్దు. ఉన్నతాధికారుల ఆదేశాలతో షాపుల యజమానులు, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాం. నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపడుతున్నాం. – సుష్మారావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి

డ్రైవర్, కండక్టర్‌పై దాడిచేసిన ఇద్దరిపై కేసు

సారంగపూర్: ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రాణాపూర్ సమీపంలో శుక్రవారం రాత్రి నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆవును ఢీకొట్టగా తీవ్రంగా గాయపడింది.డ్రైవర్ బస్సును నిలపకుండా వెళ్లాడు. ఆగ్రహించిన గ్రామస్తులు ఆడె శ్రీనివాస్, మోహన్‌నాయక్‌లు వెంబడించిన బస్సును నిలిపివేయించారు. డ్రైవర్‌తోపాటు కండక్టర్‌ను దాడిచేసిన ఇద్దరిపై శనివారం కేసు నమోదు చేసి నిర్మల్‌కోర్టులో హాజరుపర్చగా, 11రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

- బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న


నిరసన తెలుపుతున్న జోగు రామన్న, జనార్దన్

ఆదిలాబాద్‌టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి హింసను ప్రేరేపించేలా, ప్రజలను రెచ్చగొట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తన పుట్టినరోజు వేరే వాళ్ల చావులను కోరడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఎస్పీ గౌస్ ఆలంను కలిసి ఫిర్యాదు చేశారు. నిరసనలో జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పార్టీ నాయకులు అలాల్ అజయ్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేశ్, దాసరి రమేశ్, కొండా గణేశ్, పవన్ నాయక్, దమ్మాపాల్, బట్టు సతీశ్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: వెల్డింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన సర్దార్‌ఖాన్ (53) శుక్రవారం మహారాష్ట్రలోని పాంఢ్రకవడలోని మహా ఆశ జిన్నింగ్ మిల్లులో వెల్డింగ్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మిల్లు సిబ్బంది ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా రాజ్‌గడ్‌కు చెందిన లోకండే ప్రమోద్ (30) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 4న ఇంట్లో పురుగుల మందు తాగగా కుటుంబీకులు గమనించి రిమ్స్‌కు తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమోద్.. గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ఆశించిన స్థాయిలో పంటలు పండక కుటుంబీకులు చదివించలేని స్థితిలో ఉండటంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లుగా టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ వినాయక్‌రావు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో హమాలివాడ రైల్వే ట్రాక్ పక్క నుంచి శనివారం నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన సింగరేణి ప్యాసింజర్ రైలు ఢీకొంది. ఆయన తలకు తీవ్రగాయాలు కాగా ట్రాక్‌మెన్ మల్లేశ్ గమనించి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చామని, వివరాలకు తెలిసిన వారు 8712658596, 9701112343 సెల్‌నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు.

హత్యకు సహకరించిన వ్యక్తి రిమాండ్

భీమిని: కన్నెపల్లి మండలం సాలిగాం పంచాయతీలో గోమాస నరేందర్ హత్యకు సహకరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గత అక్టోబర్ 15న సాలిగాం గ్రామంలో అల్లుడు గోమాస నరేందర్ వేధింపులు భరించలేక మామ గోలేటి శంకర్ అతన్ని గొడ్డలితో దాడి చేసి హత్యచేశాడు. మామ శంకర్, అత్త లక్ష్మి, భార్య భవాని అలియాస్ బేబిలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. హత్యకు సహకరించిన భీమారం మండలం లంబడితండాకు చెందిన బానోతు రాము పాత్ర ఉందని తెలడంతో శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నగదు, బైక్‌తో యువకుడు పరారీ

ఇంద్రవెల్లి: నగదు, బైక్‌తో యువకుడు పరారీ అయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం..గుడిహత్నూర్ మండలం శాంతపూర్‌కు చెందిన వ్యాపారి సాబ్లే జైరాం అదేగ్రామానికి చెందిన బస్సీ ఓంకార్‌లు మొక్కజొన్న పంట కొనుగోలు చేయడానికి శనివారం ఇంద్రవెల్లి మండలం బుర్సన్‌పటర్‌కు బైక్‌పై వచ్చారు. సాబ్లే జైరాం రైతుల వద్దకు వెళ్లి మొక్కజొన్న నాణ్యత, తేమశాతం చూస్తున్నాడు. ఆ సమయంలో బైక్‌తోపాటు అందులో ఉన్న రూ.4.20 లక్షల నగదుతో ఓంకార్ పరారీ అయ్యాడు. జైరాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.